క్లుప్తంగా

10 గంటల పని విధానం రద్దు చేయాలి



మైలవరం: అక్టోబర్ 12, 13 తేదీలలో కొండపల్లిలో నిర్వహించనున్న సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా 12వ మహాసభలు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్ కార్మికులకు పిలుపునిచ్చారు. మైలవరం సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా మహాసభల కరపత్రం సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాసభలలో కార్మికుల సమస్యలపై చర్చిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 10 గంటల పని విధానం తక్షణమే రద్దు చేయాలని, లేని పక్షంలో బలమైన కార్మిక ఉద్యమాన్ని రాష్ట్ర ప్రభు త్వం ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. ముఠా వర్కర్స్ సీనియర్ నాయకులు తిరుపతిరావు,మారేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాల దిగుబడిని మరింత పెంచాలి



ముసునూరు: పాడి రైతులు పాల దిగుబడిని మరింత పెంచి, లాభాలు పొందాలని కృష్ణా మిల్క్ యూనియన్ బోర్డు చైర్మన్ చలసాని ఆంజనేయులు సూచించారు. అక్కిరెడ్డిగూడెంలో పాల సేకరణ కేంద్రం వద్ద సంఘ అధ్యక్షుడు బజారు రమేష్ అధ్యక్షతన సోమవారం పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేశారు. పెయ్యి దూడల జననం కోసం కావల్సిన వీర్యాన్ని కృష్ణా మిల్క్ యూనియన్ సబ్సిడీపై కేవలం రూ.50 కే అందిస్తుందన్నారు. 240 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.2,29,070 బోనస్ పంపిణీ చేశారు. హనుమాన్ జంక్షన్ క్లస్టర్ సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాలు గరం గరం

తిరువూరు: స్థానిక నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం గందరగోళంగా జరిగింది. అనారోగ్య కారణాలతో సమావేశాలకు హాజరు కాని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అనుమోలు రమాదేవి, రామవరపు మంజుల సభ్యత్వాలను రద్దు చేయాలని వైఎస్సార్ సీపీ నుంచి ఇటీవల టీడీపీలో చేరిన 9వ వార్డు కౌన్సిలర్ మూడు దుర్గారావు ప్రతిపాదించగా వైఎస్సార్ సీపీ సభ్యులు వ్యతిరేకించారు. టీడీపీ కౌన్సిలర్లు ఈ అంశంపై ఓటింగ్ జరపాలని డిమాండ్ చేయడంతో అధికార ప్రతిపక్ష సభ్యుల నడుమ వాగ్వివాదం జరిగింది. సమావేశంలో ప్రతిపాదించిన ఎజెండాలోని పలు అంశాలపై టీడీపీ సభ్యులే డిసెంట్ నోట్ ఇవ్వడంతో నగర పంచాయతీ పాలకవర్గ నిర్ణయాలపై చర్చించాలని వైఎస్సార్ సీపీ సభ్యులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో ప్రధాన సమస్యలను పలుమార్లు ప్రతిపాదించినా నిధులు కేటాయించకుండా అధికారపార్టీకి చెందిన కౌన్సిలర్ల వార్డుల్లోనే పనులు చేపట్టడం ఏమిటని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్ తదితరులు ప్రశ్నించారు. చైర్ పర్సన్ కే నిర్మల అధ్యక్షతన సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కొండపల్లి మున్సిపల్ కౌన్సిల్..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి కౌన్సిల్ సమావేశం రసవత్తరంగా జరిగింది. అధికార టీడీపీ సభ్యులు పాలకవర్గంలో జరుగుతున్న నిధుల వ్యయంపై ప్రశ్నించడం కొద్దిసేపు అయోమయానికి గురిచేసింది. కొండపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అధ్యక్షతన సోమవారం జరిగింది. అధికార పక్షం సభ్యులే విపక్ష సభ్యులుగా ప్రశ్నించడంతో ఒక్కసారిగా సభలో అయోమయం ఏర్పడింది. ఎజెండాలో అంశాలను అధికారులు సభ్యులకు వివరిస్తూ ఉండగా టీడీపీ వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్ మాట్లాడుతూ చేస్తున్న ఖర్చులకు సభలో ప్రవేశపెట్టిన బిల్లులకు పొంతనలేదన్నారు. చదును చేసే జేసీబీ పనులకు లక్షల్లో బిల్లులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. సభలో ప్రవేశపెట్టిన బిల్లులకు అసలు పనులు జరిగాయా లేదా అని నిలదీశారు. సున్నం, బ్లీచింగ్, వీధిలైట్లు కొనుగోలు కాంట్రాక్టు ఇవ్వగా మరలా విడిగా కొనుగోలు చేసినట్లు పెట్టడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓదశలో మున్సిపల్ కమిషనర్ మాస్మి గనియాకు వైస్ చైర్మన్ శ్రీనివాస్‌కు మాటల యుద్ధం పెరిగింది. ఈ దశలో మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు కలగజేసుకొని ఇద్దరిని సముదాయించారు. మున్సిపల్ సమావేశంలో సంయమనం పాటించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ గుంజా శ్రీనివాస్, కౌన్సిలర్‌లు మొగిలి దయాసాగర్, సీహెచ్ నారాయణ, సీహెచ్ వాసు, నల్లమోతు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ శ్రీనివాసరావు



కొండపల్లి మున్సిపాలిటీ సమావేశంలో పాలక పక్షాన్ని ప్రశ్నిస్తున్న వైస్ చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్



నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ

సమస్యలపై నూజివీడు కౌన్సిలర్ల నిలదీత

నూజివీడు: పట్టణంలో సమస్యలపై కౌన్సిల్ సభ్యులు గళమెత్తడంతో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం దద్దరిల్లింది. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. అధికారుల అలసత్వం కారణంగా పట్టణంలో ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారని కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, టీడీపీ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ నాదు నాగమల్లేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ తాగునీటి సమస్యతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్యాంకర్‌లతోనైనా తాగునీటిని సరఫరా చేయాలన్నారు. సక్రమ నీటి సరఫరా కోసం ఇంజినీరింగ్ అధికారులు ముందుగా చొరవ చూపకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఎన్నిసార్లు కౌన్సిల్ సమావేశాల్లో చెప్పినా పారిశుద్ధ్యం విషయంలో ఎలాంటి మార్పు రావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కోతులు, కుక్కల బెడదను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అధికారులు స్పందించాలని కోరారు. అనంతరం ఎజెండాలోని పలు అభివృద్ధి అంశాలపై చర్చించి, కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, షేక్ మెహబూబ్‌బీ, మున్సిపల్ డీఈ వెంకట్రావు సిబ్బంది పాల్గొన్నారు.

మాంసం మార్కెట్ ఏర్పాటు చేస్తాం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో మాంసం దుకాణాలు మొత్తం ఒకే చోట ఉండేలా ఏర్పాట్లు చేస్తామని డెప్యూటీ ఎంపీడీఓ ఆనంద్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగిరిపల్లిలో సుమారు 20 మాంసం దుకాణాలు ఉన్నాయని కొన్ని దేవాలయాల వద్ద, మరికొన్ని రోడ్డు, మురుగు కాలువల వద్ద ఉన్నాయని అన్నారు. దేవాలయాల వద్ద మాంసం విక్రయాలు జరపడంతో భక్తులు ఫిర్యాదు చేస్తున్నారని, రోడ్లు, మురుగు కాలువల వెంట ఏర్పాటు చేసిన మాంసం దుకాణాల వద్ద విక్రయాలు జరపడంతో దుమ్ము, దూళితోపాటు దుర్గంధం వస్తుంది. దుకాణాలు మొత్తం చొప్పరమెట్ల రోడ్డులో ఉన్న ఖాళీ ప్రదేశంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి నామమాత్రపు అద్దె వసూలు చేస్తామని, దీని ద్వారా పంచాయతీకి కూడా ఆదాయం వస్తుందన్నారు. కొనుగోలుదారుడికి కూడా సౌలభ్యంగా ఉంటుందన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించొద్దు

సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించొద్దని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సబ్ కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను గడువులోగా పరిష్కరించలేకపోతే దానికి సంబంధించిన సరైన కారణాన్ని అర్జీదారుడికి తెలపాలన్నారు. 35 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. డీఎల్‌డీఓ వెంకటరత్నం, కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగలక్ష్మి, సీడీపీఓ పిల్లి విజయలక్ష్మి, ఏడీఏ వీరబాబు, ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీనివాసరావు, హెచ్‌ఓ ఆర్ హేమ, ఏడీఏ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీల్లో కొన్ని..

- నూజివీడు మండలం దేవరగుంటకు చెందిన చేకూరి నాగేశ్వరరావు అనుమతి లేకుండా కరెంటు సర్వీసు ఏర్పాటు చేసుకొని వ్యవసాయ బోర్లు ఆడిస్తున్నారని, దీనివల్ల పక్కన ఉన్న బోర్లలోని నీటి మట్టం పడిపోతోందని, అనుమతి లేని సర్వీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జంగంగూడెంకు చెందిన కంచర్ల సాంబశివరావు అర్జీని అందజేశారు.
- తన ఆస్తిని అక్రమంగా కాజేయాలనే ఉద్దేశంతో తనకు ఆరోగ్యం బాగోలేని సమయంలో తనతో వేలిముద్రలు వేయించుకొని రూ.5 లక్షలు ఇచ్చినట్లు నక్కిరెడ్డి అప్పారావు, దత్తి నాగేంద్రరావు, శిరపా శ్రీను బెదిరిస్తున్నారని, వారి నుంచి కాపాడాలని కోరుతూ నూజివీడు పట్టణంలోని కొప్పుల వెలమపేటకు చెందిన దత్తి సత్యవతి అర్జీని అందజేశారు.



అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న

పోషకాహారంతో ఆరోగ్యం

చాట్రాయి: ఆరోగ్యకరమైన మహిళతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీదేవి తెలిపారు. సోమవారం మండలంలోని తుమ్మగూడెంలో నిర్వహించిన స్వస్థ్ నారీ శశక్త్ పరివార్ అభియాన్ పథకంలో నిర్వహించిన పోషణ మహోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యం ఎంతో బాగుంటుందని అన్నారు. వైద్యాధికారులు దుర్గాప్రసాద్, పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్ఞానప్రదాయినీ.. విద్యాస్వరూపిణీ

తిరువూరు: నూజివీడు, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజైన సోమవారం మూలా నక్షత్ర సందర్భంగా అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి పలు దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడంతో పాటు సరస్వతీదేవికి విద్యార్థులతో పూజాదికాలు జరిపారు. తిరువూరు అష్టలక్ష్మి ఆలయం, శ్రీగౌరీ కేదారేశ్వరాలయం, శ్రీచంద్రమౌళీశ్వరాలయం, శ్రీరామలింగేశ్వ రాల యం, ఆర్యవైశ్య కల్యాణ మంటపం, షిర్డిసాయి మందిరం, కోదండ రామాలయం, రాజుపేట, కూరగాయల మార్కెట్ సెంటర్లలో సరస్వతీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. గంపలగూడెం మండలం ఊటుకూరు, పెనుగొలను, గంపలగూడెం గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో విద్యాలక్ష్మీదేవికి పూజాదికాలు జరిపారు. ఏకొండూరు మండలంలోని కంభంపాడు, ఏకొండూరు, గోపాలపురం గ్రామాలో ఉత్సవాలు జరిగాయి.

మైలవరం: స్థానిక కేడీసీసీ బ్యాంకు వద్ద, ఆర్ అండ్ బీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో అమ్మవారి విగ్రహాలను సరస్వతీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. మైలవరం రాజాపేటలోని రేణుక ఎల్లమ్మ త్రిశక్తి పీఠంలో దేవీశరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి.

నూజివీడు: పట్టణంలో కొలువై ఉన్న కోట మహిషాసురమర్ధని అమ్మవారు సోమవారం శ్రీసరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలానక్షత్రం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని కంచికామాక్షి ఆలయంలో పూజలు జరిపారు. పాతపేటలోని జ్ఞానసరస్వతీ దేవాలయంలో అమ్మవారికి, దత్తాశ్రమంలోని అమ్మవారికి, 32వ వార్డులోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలోని కనకదుర్గ అమ్మవారికి, కోనేరుపేటలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారికి, జంక్షన్ రోడ్డులోని జ్ఞాన సరస్వతీ ఆలయంలోని సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట మహిషాసురమర్థిని అమ్మవారి ఆలయంలో విద్యార్థులచే శ్రీసరస్వతీదేవి పూజ నిర్వహించారు. ఆలయ ఈవో అలివేణి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆగిరిపల్లి: స్థానిక రుద్రభూమి వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో మూలానక్షత్రం సందర్భంగా అమ్మవారికి పూజలు చేశారు. 4 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. వట్టిగుడిపాడు రామాలయం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారికి పూజలు చేశారు. ఈదులగూడెంలో సరస్వతి దేవిగా భక్తు లకుదర్శనమిచ్చారు. తోటపల్లిలో అమ్మవారికి తోట పల్లి ట్రెండ్ సెట్టర్స్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

చాట్రాయి: కనకదుర్గ అమ్మవారు సోమవారం సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆరుగొలనుపేట మహాలక్ష్మమ్మ అంకమ్మ అమ్మవారి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.



అరుగొలనుపేటలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న పండితులు



కోటమహిషమ్మ ఆలయంలో సరస్వతీ పూజ

ఆగిరిపల్లి: చిన్నాగిరిపల్లి గొల్లగూడెంలో కృష్ణ దుర్గాదేవి అమ్మవారిని మూలా నక్షత్రం పురస్కరించుకుని సరస్వతీదేవిగా అలంకరించారు. క్షేత్రం వ్యవస్థాపకులు వీర కృష్ణ భవాని భక్తులు అందజేసిన పుట్టింటి పసుపు, కుంకుమలను సమర్పించారు.

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల మారెమ్మఅమ్మవారి దేవస్థానంలో మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు.

చేశారు. పలు గ్రామాల్లో అన్నదాన ప్రసాదాలు నిర్వహించారు.

బలివే (ముసునూరు): బలివేలోని ప్రసిద్ధ శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు, ఈఓ పామర్తి సీతారామయ్య ఆధ్వర్యంలో అర్చకులు చావలి అమర్ బాబు ఉప ఆలయంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరింపజేసి, భక్తులకు దర్శనం కల్పించారు. చిన్నారులచే పూజలు చేయించారు. గోపవరం కాశీ విశ్వేశ్వరాలయం, చెక్కపల్లి, గుడిపాడు, వేల్పుచర్ల, లోపూడిల్లోని శ్రీకోదండ రామాలయాల్లో అమ్మవారిని సరస్వతి మాతగా అలంకరించి, మహిళలు, భవానీ మాల ధారులు పూజలు చేశారు.

జ్ఞానసరస్వతీ ఆలయంలో..

నూజివీడు: నూజివీడులోని జ్ఞానసరస్వతీ ఆలయం భక్తుల రాకతో సోమవారం మూలానక్షత్రం కావటంతో కిక్కిరిసిపోయింది. ఏలూరు జిల్లాతో పాటు పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, పక్కనే ఉన్న ఖమ్మం జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి సరస్వతీదేవిని దర్శించుకుని పులకించారు. దాదాపు 1200 మంది చిన్నారులకు సోమవారం సరస్వతీ ఆలయంలో విద్యాభ్యాసం చేయించారు. సీఐ పీ సత్యశ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తుల వాహనాలు నూజివీడు– జంక్షన్ రోడ్డుకు ఇరువైపులా పెట్టడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి.



నూజివీడు సరస్వతీ ఆలయంలో వాగ్దేవి సన్నిధిలో అక్షరాభ్యాసం

సామూహిక అక్షరభ్యాసాలు, హోమాలు నిర్వహించారు. స్థానిక ద్వారకానగర్‌లో ఉన్న కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. పద్మశాలి వీధిలో భక్తుల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు.

జి.కొండూరు: స్థానిక బీసీ కాలనీలో కనకదుర్గమ్మ అమ్మవారు సోమవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సరస్వతీదేవి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఇబ్రహీంపట్నం: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో దుర్గమ్మ అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం అమ్మవారి జన్మదినం మూలా నక్షత్రం పురస్కరించుకుని వివిధ గ్రామాల్లోని దేవాలయాలు, చలువ పందిళ్లలో సరస్వతి దేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదం పంపిణీ

రాయనపాడు(విజయవాడరూరల్): రాయనపాడులోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ సర్పంచి కాటంనేని కళ్యాణి పూర్ణచంద్రరావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఏకొండూరు మండలం గోపాలపురం సాయిమందిరంలో..



గంపలగూడెం మండలం పెనుగొలను శివాలయంలో



కొండపల్లి చెన్నకేశవ స్వామి ఆలయంలో




మైలవరం కేడీసీసీబీ వద్ద సరస్వతీదేవి అలంకారంలో..



తిరువూరు శ్రీగౌరీకేదారేశ్వరాలయంలో జ్ఞానసరస్వతీదేగా



జి.కొండూరు బీసీ కాలనీలో సరస్వతీ దేవిగా అమ్మవారు



సరస్వతీదేవి అలంకారంలో పుట్రేల మారెమ్మ అమ్మవారు

రేపు మండల పరిషత్ సమావేశం

ముసునూరు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.ఏసుబాబు సోమవారం విలేకరులకు తెలిపారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, ఇతర సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఎంపీడీవోకు వినతి



చాట్రాయి: హౌస్ హోల్డ్ మ్యాపింగ్ నుంచి పిల్లల పేర్లు తొలగించాలని కోరుతూ మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కొమ్ము ఆనందం సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు. పిల్లల పేర్లు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ నుంచి తొలగించాలని ఈ నెల 4న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో, 8న ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. మ్యాపింగ్‌లో పేర్లు తొలగించక పోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదని చెప్పారు.

ఎమ్మెల్యే బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

ముసునూరు: టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, ఆయన క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ ఏపీ స్టేట్ ప్రచార వింగ్ సెక్రటరీ, వైస్ ఎంపీపీ పాముల గంగాధర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బాలకృష్ణ చైర్మన్‌గా ఉన్న బసవ తారకం కేన్సర్ ఆస్పత్రి విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన మేలును మర్చిపోయి, అనుచితంగా మాట్లాడడం ముమ్మాటికీ క్షమార్హం కాదన్నారు. తక్షణం వ్యాఖ్యలు వెనక్కు తీసుకుని, బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వ్యాయామంతో గుండె జబ్బులు దూరం



తిరువూరు: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహార నియమాలు పాటిస్తూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే గుండె జబ్బులకు దూరంగా ఉండవచ్చని ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ పూర్ణానంద్ సూచించారు. తిరువూరు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ దినోత్సవ సందర్భంగా సోమవారం 3కే రన్ నిర్వహించారు. తిరువూరు బోస్‌సెంటర్ నుంచి దారా టౌన్‌షిప్‌లోని శ్రీనిధి స్కూలు వరకు 3కే రన్ కొనసాగింది. స్కూలు ఆవరణలో జరిగిన అవగాహన సదస్సులో పూర్ణానంద్ మాట్లాడుతూ గుండె ఆరోగ్యాన్ని పరిరక్షించుకోడానికి నివారణ చర్యలే ఉత్తమమని, రక్తపోటు, మధుమేహం బారిన పడకుండా సాధ్యమైనంతవరకు ఆరోగ్యకరమైన జీవనానికి అలవాటుపడాలని ఆయన సూచించారు. వాకర్స్ క్లబ్, లయన్స్ క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



చాట్రాయి: కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువులపై జీఎస్టీ ఎత్తివేయడం వలన కుటుంబ అదాయం ఎంతో ఆదా అవుతుందని ఎంపీడీవో బళ్లా రాజు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జీఎస్టీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదతరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

కీసర(కంచికచర్ల): విద్యుదాఘాతానికి గురైన ఓ సెంట్రింగ్ కూలి గాయపడిన ఘటన కంచికచర్ల మండలం కీసర గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తెలంగాణ రాష్ట్రం మధిర గ్రామానికి చెందిన నారాయణ కీసర గ్రామంలో సెంట్రింగ్ పనిచేయడానికి వచ్చాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ ఇంటిపైన ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు.